సాక్షి
విశాఖపట్నం
గురువారం । 19 । డిసెంబర్ । 2024



'అల'కల్లోలం 8లో

అల్పపీడన ప్రభావంతో కడలి అల్లకల్లోలంగా మారింది. ఈదురుగాలులు వీయడంతో కెరటాలు పెద్ద ఎత్తున ఎగసిపడుతున్నాయి.



అర్ధాకలి బతుకులు

ఇంకా జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ ఎలా అని అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన చెందుతున్నారు. 8లో



ఉత్సాహంగా బధిరుల క్రికెట్

బధిరుల టీ–20 క్రికెట్ పోటీలు వైఎస్సార్ స్టేడియం జీ గ్రౌండ్‌లో బుధవారం ఉత్సాహంగా జరిగాయి. 8లో

న్యూస్‌రీల్

అప్పన్న సన్నిధిలో కేంద్ర సహాయ మంత్రి



కేంద్ర మంత్రి సంజయ్‌సేథ్‌కు అప్పన్న జ్ఞాపికను అందిస్తున్న డిప్యూటీ ఈవో రాధ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి సంజయ్‌సేథ్ బుధవారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. మంత్రి పేరిట అర్చకులు స్వామికి అంతరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, జ్ఞాపికను దేవస్థానం డిప్యూటీ ఈవో రాధ మంత్రికి అందించారు.

రేపు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం



డాబాగార్డెన్స్ : జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం ఈ నెల 20న నిర్వహించనున్నారు. జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశ మందిరంలో ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి మేయర్, స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశంలో 71 అంశాలు చర్చకు రానున్నాయి.

21న జీవీఎంసీ బడ్జెట్‌పై సమావేశం

2024–2025 మార్చి నెల వరకు బడ్జెట్‌తో పాటు 2025–2026 బడ్జెట్‌కి సంబంధించి స్థాయీ సంఘ సభ్యులు ఈ నెల 21న సమావేశమై చర్చించనున్నారు. సవరించిన బడ్జెట్‌ను త్వరలో కౌన్సిల్ సమావేశం నిర్వహించి సభ్యుల ఆమోదానికి పంపనున్నారు.

ఆలస్యంగా మూడు విమానాలు



విశాఖ సిటీ: వాతావరణం మార్పులు, రన్‌వే పై నావికాదళం చేపడుతున్న మరమ్మతులు కారణంగా బుధవారం మూడు విమానాలు ఆలస్యంగా విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నాయి. అల్పపీడనం కారణంగా మేఘాలు దట్టంగా కమ్ముకున్నాయి. దీంతో పాటు రన్‌వే మరమ్మతులు జరుగుతున్న నేపథ్యంలో విమాన సర్వీసులు గంటకు పైగా ఆలస్యంగా ఎయిర్‌పోర్టుకు వచ్చాయి. హైదరాబాద్–విశాఖ ఇండిగో విమానం ఉదయం 7 గంటలకు రావాల్సి ఉండగా.. 1.10 గంటలు ఆలస్యంగా 8.10కి చేరుకుంది. అలాగే బెంగళూరు సర్వీస్ గంట, చెన్నై విమానం 45 నిమిషాలు ఆలస్యంగా విశాఖకు చేరుకున్నాయి.

రేపు 'టౌన్ ప్లానింగ్' ఫిర్యాదుల స్వీకరణ

డాబాగార్డెన్స్: ప్రతీ శుక్రవారం పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ఫిర్యాదులు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి పట్టణ ప్రణాళికాధికారులు ఫిర్యాదులు స్వీకరిస్తారని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

టెన్త్ మోడల్ టెస్ట్ పేపర్లు ఆవిష్కరణ



మోడల్ టెస్ట్ పేపర్లు ఆవిష్కరిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

విశాఖ విద్య: యూటీఎఫ్ ఆధ్వర్యంలో ముద్రించిన టెన్త్ మోడల్ టెస్ట్ పేపర్లను ఆ సంఘం నాయకులతో డీఈవో ప్రేమ్‌కుమార్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ నిష్ణాతులైన సీనియర్ ఉపాధ్యాయులచే 10వ తరగతి విద్యార్థుల కోసం మోడల్ పేపర్లను తయారు చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో అంబటి సోమేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి టి.ఆర్.అంబేడ్కర్, జిల్లా కోశాధికారి కె.రాంబాబు, జిల్లా సీనియర్ నాయకులు బి.జనార్దనరావు, జిల్లా కార్యదర్శులు మహ్మద్ రిజ్వాన్, టి.జగన్ పాల్గొన్నారు.

బడుగుల పైకి బుల్డోజర్



బీచ్‌రోడ్డులోని రామాద్రి వద్ద పొక్లెయినర్‌తో దుకాణాల తొలగింపు (ఫైల్)

ఇష్టారాజ్యంగా కూల్చివేతలు

ఓ వైపు పేదల దుకాణాలను జేసీబీలతో కూటమి ప్రభుత్వం కూలగొట్టిస్తుండగా... మరోవైపు అధికార పార్టీ నేతలు ప్రభుత్వ స్థలాలపై గద్దల్లా వాలిపోతున్నారు. ప్రభుత్వ బోర్డులను తొలగించి మరీ యథేచ్ఛగా హస్తగతం చేసుకుంటున్నారు. ఇటువైపు మాత్రం జీవీఎంసీ అధికారులు కనీసం కన్నెత్తి చూడటం లేదు. కూటమి నేతల ఫొటోలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకొని ఇష్టారాజ్యంగా గ్రీన్‌బెల్టును కబ్జా చేసినా పట్టించుకోవడం లేదు. స్వయంగా కూటమి ఎమ్మెల్యే ఫిర్యాదు చేస్తే తప్ప అక్కడకు అధికారులు కదలలేదు. అయితే, గ్రీన్‌బెల్టును నాశనం చేసినప్పటికీ సదరు నిర్మాణదారుపై మాత్రం ఎటువంటి కేసులు నమోదు చేయలేదు.

– సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

- 200కి పైగా చిరు దుకాణాల తొలగింపు
- ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డ కుటుంబాలు
- తమ వారి జోలికి వెళ్లకుండా కూటమి నేతల నియంత్రణ
- ప్రభుత్వ స్థలాలపై గద్దల్లా వాలిపోతున్న అధికార పార్టీ నేతలు

గత నెల 23, 24 తేదీల్లో.. భీమిలి బీచ్‌రోడ్డులోని రామాద్రి వద్ద ఐదారేళ్లుగా పొట్టకూటి కోసం మత్స్యకారులు ఏర్పాటు చేసుకున్న 45 దుకాణాలను పోలీసు పహారాలో రెవెన్యూ, పర్యాటక శాఖలతో పాటు జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు తొలగించారు. కనీసం వారికి ముందస్తు సమాచారం ఇవ్వలేదు సరి కదా.. అక్కడ నుంచి తరలించేకునేందుకు సమయం ఇవ్వలేదు. జేసీబీలను తీసుకొచ్చి దుకాణాలను తొలగించి మత్స్యకారుల పొట్టకొట్టారు. ఇక్కడకు కూతవేటు దూరంలో గీతం యూనివర్సిటీ ఆక్రమణలు మాత్రం వీరికి కనిపించకపోవడం విశేషం.



దుకాణాల తొలగింపు (ఫైల్)

గత నెల 16వ తేదీన.. కూటమి కార్పొరేటర్ ఫిర్యాదు చేశారన్న కారణాన్ని చూపించి శివాజీపాలెం, పిఠాపురం కాలనీ, పీతలవానిపాలెం వద్ద గల 150 దుకాణాలను తొలగించారు. ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసుకున్న టీ దుకాణాలు, సెలూన్లు, చికెన్ షాపులు, మెకానిక్ షాపులు, కూరగాయల షాపులను ఉన్నపళంగా తొలగించడంతో ఉపాధి కోల్పోయి రోడ్డున పడాల్సి వచ్చింది.



శివాజీపాలెం వద్ద బడ్డీల తొలగింపు (ఫైల్)

తాజాగా ఈనెల 18వ తేదీన.. రోడ్డును ఆక్రమించారంటూ జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న ఏడు దుకాణాలను కూడా ఇదే రీతిన ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. మరికొన్ని షాపులకు నోటీసులు జారీచేశారు. ఈ విధంగా కూటమి ప్రభుత్వం వచ్చిన గత ఆరు నెలల కాలంలోనే ఏకంగా 200 పేద కుటుంబాలను రోడ్డున పడేసింది.

జీవీఎంసీ ఎదురుగా దుకాణాలు తొలగిస్తున్న సిబ్బంది



అక్కడలా.. ఇక్కడిలా..!

ఆక్రమణల పేరుతో చిన్న చిన్న షాపులను తొలగిస్తున్న కూటమి ప్రభుత్వం... బీచ్‌రోడ్‌లో కనీస అనుమతి లేకుండా అడ్డదిడ్డంగా భారీ నిర్మాణాలు చేస్తున్నా కన్నెత్తి చూడటం లేదు. కోస్టల్ రెగ్యులేటరీ జోన్ (సీఆర్‌జెడ్) అనుమతి లేకుండానే సముద్ర తీరానికి నష్టం వాటిల్లేలా నిర్మాణాలను చేపడుతున్నారు. బార్లు, రెస్టారెంట్లతో పాటు అనధికారికంగా అసాంఘిక కార్యకలాపాలు ఇక్కడ నడుస్తున్నా పట్టించుకోవడం లేదు. జీవీఎంసీ అనుమతి లేకుండా ఏర్పాటుచేసిన విరాగో బార్‌తో పాటు సముద్ర తీరానికి ఆనుకొని భీమిలికి సమీపంలో జీ–జాగ్ పేరుతో చేపట్టిన అనధికార నిర్మాణాల జోలికి వెళ్లడం లేదు. వీటిపై జీవీఎంసీతో పాటు సీఆర్‌జెడ్‌కు కూడా ఫిర్యాదులు వెళ్లాయి. తమ నుంచి ఎటువంటి అనుమతి తీసుకోలేదని సీఆర్‌జెడ్ స్పష్టం చేసింది. అంతేకాకుండా జీ–జాగ్ నిర్మించిన ప్రాంతం ఏకంగా నో–కన్‌స్ట్రక్షన్ జోన్‌లో ఉంది. కూటమి నేతల అండదండలు ఉండటంతో వీటి జోలికి వెళ్లడం లేదు. కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు.

నెలకు రూ.10 వేల చొప్పున వసూలు!

అధికార పార్టీ ఎమ్మెల్యేల అండదండలు.. స్థానిక కార్పొరేటర్, వార్డు అధ్యక్షుడి సిఫారసుతో రోడ్ల పక్కన కొత్త దుకాణాలు ఏర్పాటవుతున్నాయి. ఈ విధంగా ఒక్కో కార్పొరేటర్/వార్డు అధ్యక్షుడు తమ పరిధిలో 10 షాపుల వరకూ ఏర్పాటుకు అవకాశం ఇచ్చారు. ఒక్కో షాపు నుంచి నెలకు రూ.10 వేల చొప్పున సదరు నేతలు వసూలు చేస్తున్నారు. అంటే సదరు నేతలు నెలకు లక్ష రూపాయల చొప్పున అదనపు ఆదాయాన్ని దండుకుంటున్నారు. ఇందులో జీవీఎంసీ అధికారులకు కూడా వాటాలు ఉన్నాయన్న విమర్శలున్నాయి. అందువల్లే రోడ్డు పక్కన ఎన్నో ఏళ్లుగా నిర్వహిస్తున్న చిరు దుకాణాలను తొలగించిన అధికారులు వీటి జోలికి పోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



దుకాణాల తొలగింపును అడ్డుకుంటున్న చిరువ్యాపారులు (ఫైల్)

ఎలా బతకాలో..



సముద్రాన్ని నమ్ముకుని బతుకుతున్నాం. తుపాను సమయాల్లో వేట అంతంత మాత్రమే సాగుతుంది. ఆర్థిక భారం తగ్గించుకునేందుకు చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నాం. ఇప్పుడు దుకాణాలు తొలగించేశారు. ఇప్పుడు మేము ఎలా బతకాలో ప్రభుత్వమే చెప్పాలి.

– కుమారి, బాధితురాలు, మంగమారిపేట

మాకిక చావే దిక్కు



వేటకు వెళ్లనివ్వరు, వ్యాపారం చేసుకోనివ్వరు, మరి మత్స్యకారులు ఎలా బతకాలి. కూటమి నాయకులను నమ్ముకుని మత్స్యకారులమైన మేము మోసపోయాం. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోకపోతే మాకు చావే దిక్కు.

– ఎ.అమర్‌నాథ్, మంగమారిపేట

ప్రైవేటు స్థలంలో షాపు తొలగించారు



గత 28 ఏళ్లుగా ఇదే ప్రాంతంలో బైక్ మెకానిక్‌గా ఉంటున్నాను. ప్రస్తుతం రోడ్డుకు ఆనుకొని ఉన్న ఒక ప్రైవేటు స్థలంలో అద్దె చెల్లిస్తూ షాపు నిర్వహిస్తున్నాను. నాకు కనీసం సమాచారం ఇవ్వకుండా ఉదయాన్నే షాపును నేల మట్టం చేశారు. అందులో ఉన్న కస్టమర్ల బైకులు కూడా దెబ్బతిన్నాయి. కుటుంబమంతా రోడ్డు మీదకు వచ్చాం.

– సుధాకర్, బైక్ మెకానిక్ షాపు, శివాజీపాలెం

బాబూ.. ఇదేం బాదుడు?

- సంపద సృష్టించడమంటే ప్రజలపై భారం వేయడమా?
- స్మార్ట్ మీటర్లను పగలగొట్టండన్న లోకేష్ వ్యాఖ్యలు మర్చిపోగలమా..
- విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్‌మీటర్లపై ప్రభుత్వం పునరాలోచించాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో మేధావులు, సామాజిక వేత్తల డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకురాలు మణి

సాక్షి, విశాఖపట్నం: 'ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు తగ్గిస్తానన్న చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపారు. సంపద సృష్టించడమంటే ఇదేనా? ప్రజలపై సర్దుబాటు చార్జీల పేరిట వడ్డించడమా? విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే దురదృష్టకరమైన బషీర్‌బాగ్ వంటి ఘటనలు పునరావృతం కాక తప్పదు'అని పలువురు మేధావులు, సామాజిక వేత్తలు హెచ్చరించారు. ద్వారకానగర్‌లోని పబ్లిక్ లైబ్రరీలో ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.ఆర్ కృష్ణంరాజు ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. వినియోగదారులపై సర్దుబాటు చార్జీల కింద వసూళ్లు చేస్తున్న మొత్తం రూ.17,898 కోట్లను ప్రభుత్వమే భరించాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు చార్జీలు తగ్గించాలని, సామాన్య ప్రజలకు అనుకూలమైన పాలన, విధానాలు అమలు చేయాలని, స్మార్ట్ ఎనర్జీ మీటర్ల ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలనే తీర్మానాలను కృష్ణంరాజు ప్రవేశపెట్టగా.. అందరూ ఆమోదించారు.

చార్జీల పెంపుతో ప్రజలపై పెనుభారం

ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ, 'విద్యుత్ చార్జీల పెంపుతో గృహ వినియోగదారులు, రైతులపై పెనుభారం పడుతోంది. సర్దుబాటు చార్జీల పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై సుమారు రూ.17,898 కోట్ల భారం మోపడం దారుణం. సగటున యూనిట్‌కు రూ.15 వరకు వినియోగదారుడు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాం.'అని తెలిపారు. ఏయూ విశ్రాంత ప్రొఫెసర్ తమ్మారెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలకు విరుద్ధంగా ప్రభుత్వాలు పాలన చేస్తే ప్రజలు క్షమించరన్నారు. విద్యుత్ చార్జీలు పెంచడం ద్వారా అన్ని రంగాలపై దాని ప్రభావం ఉంటుందన్నారు. స్మార్ట్ మీటర్ల పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్ల రూపాయలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నాయని ఆరోపించారు. సీఐటీయూ నాయకురాలు మణి మాట్లాడుతూ ఎక్కువ వినియోగం ఉన్న సమయంలో పీక్ ఆఫ్ టైం పేరిట చార్జీలు వసూళ్లు చేస్తారని చెప్పడం దారుణమన్నారు. సర్దుబాటు చార్జీలు తగ్గించి..అదానీతో స్మార్ట్‌మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని వ్యతిరేకించాలని, అవసరమైతే పగలగొట్టండని ప్రతిపక్షంలో ఉండగా నారా లోకేష్ ఇచ్చిన పిలుపును ఇప్పుడు ఎందుకు అమలు చేయట్లేదని ప్రశ్నించారు.

దోపిడీలో చంద్రబాబుకు 40 ఏళ్ల అనుభవం

సీపీఎం నేత గంగారావు మాట్లాడుతూ దేశంలో ఏపీ, గుజరాత్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో మాత్రమే ట్రూ అప్ చార్జీల పేరిట వసూళ్లు చేస్తు న్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తిని ప్రైవేట్ చేతుల్లో పెట్టే కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఏపీ ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు జె.టి.రామారావు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే రాజకీయాల్లోకి వచ్చామని చెప్పుకునే పవన్ కల్యాణ్ లాంటి వారు విద్యుత్ చార్జీల పెంపుపై మాట్లాడటం లేదన్నారు. ఆరు నెలల పాలనలో విద్యుత్ చార్జీలు, నిత్యావసర ధరలు భారీగా పెరిగినప్పటికీ.. ఆ ఊసే పట్టనట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రైల్వే యూనియన్ నాయకుడు రామచంద్రమూర్తి మాట్లాడుతూ సీఎం చంద్రబాబుకు దోపిడీలో 40 ఏళ్ల అనుభవం ఉందని ఆరోపించారు. వినియోగదారుడు రోడెక్కి ప్రశ్నించిన రోజే ఈ ప్రభుత్వంలో మార్పు వస్తుందన్నారు. సామాజిక కార్యకర్త సన్‌మూర్తి మాట్లాడుతూ సామాన్యుడికి వచ్చే ఆదాయంలో సగం విద్యుత్ చార్జీలకే చెల్లిస్తే.. ఆ కుటుంబ పోషణ ఎలా గడుస్తుందని ప్రశ్నించారు. స్వచ్ఛంద సంస్థ అధినేత వై.నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు 'బాదుడే బాదుడు'పేరిట ఆందోళనలు చేశారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు నెలల్లో సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు వ్యవసాయ బోర్లకు స్మార్ట్‌మీటర్లు బిగిస్తున్నారని.. రైతులు ఎలా వ్యవసాయం చేయాలని ప్రశ్నించారు. వ్యాపారవేత్త జి.త్యాగరాజు మాట్లాడు తూ వినియోగదారుడు వాడని విద్యుత్‌కూ బిల్లు చెల్లించాల్సి వస్తోందన్నారు.

నిఘా ఏర్పాటు చేస్తాం

సాక్షి ఎఫెక్ట్..



ఇసుక తరలించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో సంగీత్ మాధుర్

కొమ్మాది: ఖనిజాల కోసం రాత్రి పూట భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేట, ఉప్పాడ తీర ప్రాంతాల్లో సముద్రపు ఇసుక తరలింపుపై 'తీరంలో ఇసుక తుపాను' శీర్షికన సాక్షిలో బుధవారం ప్రచురితమైన కథనానికి ఆర్డీవో సంగీత్ మాధుర్ స్పందించారు. ఇసుక తవ్విన ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులతో నిఘా ఏర్పాటు చేస్తామని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇక్కడ ఇసుక తరలింపు వలన భారీ స్థాయిలో గోతులు ఏర్పడటం వాస్తవమేనని, ఇకపై ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో జరుగుతున్న గ్రావెల్ మాఫియాపై పలు కేసులు నమోదు చేసి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

1 నుంచి కొత్త మార్కెట్ విలువలు

సీతంపేట: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2025 జనవరి ఒకటో తేదీ నుంచి జిల్లాలోని 9 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువలు సవరిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ మాయూర్ అశోక్ తెలిపారు. మార్కెట్ విలువలు సవరించే ప్రక్రియలో భాగంగా బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ డీఐజీ జి.బాలకృష్ణ, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రరావు, తహసీల్దార్లు, జోనల్ కమిషనర్లు, ఆర్‌ఐలు పాల్గొని.. 3 నెలల నుంచి వివిధ వర్గాల నుంచి సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి మార్కెట్ విలువను ఎంత మేరకు సవరించాలనే ప్రాథమిక అంగీకారానికి వచ్చారు. దీని ప్రకారం మార్కెట్ విలువల సవరణ జాబితాను తయారు చేసి రానున్న రెండు రోజుల్లో సంబంధిత కమిటీల ఆమోదానికి పంపనున్నారు. ఆ తర్వాత సవరణ జాబితాలను ప్రభుత్వ రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని సమావేశంలో నిర్ణయించారు. ఆమోదించే మార్కెట్ విలువలు జనవరి ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తాయని వెల్లడించారు.

ఎస్సీ వర్గీకరణపై 194 వినతులు



మాట్లాడుతున్న షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా

మహారాణిపేట: షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ సమాచారం పూర్తి స్థాయిలో అధికారుల వద్ద ఉండాలని షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణ ఏక సభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా అన్నారు.బుధవారం కలెక్టరేట్‌లో ఆయన కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌తో కలిసి షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణపై ప్రజలు, ఉద్యోగులు, వివిధ కుల సంఘ నాయకుల నుంచి అభిప్రాయాలు, వినతులు స్వీకరించారు. మొత్తం 194 వినతులు వచ్చినట్లు ఆయన తెలిపారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందుగా కలెక్టర్ జిల్లాలో ఉన్న కులాల వారీగా గణాంకాలు వివరించారు. విద్యాశాఖ, జిల్లా పరిషత్, జిల్లా పంచాయతీ ఆఫీస్, వైద్య ఆరోగ్యశాఖ, డీఆర్డీఏ, ఏపీ ఈపీడీసీఎల్, ఆర్టీసీ, డ్వామా, ఎస్సీ కార్పొరేషన్, ట్రైబల్ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ శాఖ, ఎక్సైజ్ శాఖ, మార్కెటింగ్ శాఖ, గృహనిర్మాణ శాఖ కార్యాలయాల్లో షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై సంబంధిత వివరాలను అధికారులు వివరించారు. సమావేశంలో డీఆర్వో భవానీశంకర్, ఆర్డీవో శ్రీలేఖ, వికలాంగుల సంక్షేమ సహాయ సంచాలకులు జె.మాధవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మతోపాటు అధికారులు పాల్గొన్నారు.

మీ కోసం మీ పోలీస్ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న మంత్రి అనిత

దాబాగార్డెన్స్: మీ కోసం మీ పోలీస్ కరపత్రాన్ని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత బుధవారం ఆవిష్కరించారు. కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి వచ్చిన ఆమె చేతులమీదుగా హార్బర్ సబ్ డివిజన్ ఏసీపీ ఎస్.కె.దాస్, వన్‌టౌన్ సీఐ జీడీ బాబు కరపత్రాన్ని ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ నేర నివారణ చర్యల్లో పోలీసులకు సహకరించాలని ప్రజలు పిలుపునిచ్చారు. నేరం జరిగిన తర్వాత బాధపడే కన్నా.. నేరం జరగకుండానే ముందస్తుగా పోలీసులు చేపట్టే నేర నివారణ చర్యలకు ప్రజలు, యువకులు సహకరించాలని కోరారు. ఆలయ ఈవో కె.శోభారాణి, పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కోర్బాకు తాత్కాలిక హాల్ట్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం–కోర్బా(18517) ఎక్స్‌ప్రెస్, కోర్బా– విశాఖపట్నం(18518) ఎక్స్‌ప్రెస్‌కు జనవరి 9, 10వ తేదీల్లో చకర్‌బత స్టేషన్‌లో తాత్కాలిక హాల్ట్ కల్పిస్తున్నారు. ఈ ప్రాంతంలో చాలీసా మహోత్సవాల సందర్భంగా తాత్కాలిక హాల్ట్ ఏర్పాటు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు

మారిన కోచ్‌లతో విశాఖ–చెన్నై ఎక్స్‌ప్రెస్

విశాఖపట్నం–చెన్నై సెంట్రల్(22801) ఎక్స్‌ప్రెస్ మార్చి 7 నుంచి, చెన్నై సెంట్రల్–విశాఖపట్నం (22802) ఎక్స్‌ప్రెస్ మార్చి 8 నుంచి మారిన కోచ్‌లతో రాకపోకలు సాగిస్తుందని అధికారులు తెలిపారు. విశాఖపట్నం– పారాదీప్(22810) ఎక్స్‌ప్రెస్ మార్చి 9 నుంచి, పారాదీప్–విశాఖపట్నం(22809) ఎక్స్‌ప్రెస్ మార్చి 10 నుంచి మారిన కోచ్‌లతో నడుస్తుంది.

బ్రదర్స్ అదుర్స్



పతకాలతో సోదరులు

విశాఖ స్పోర్ట్స్: నేషనల్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో విశాఖకు చెందిన అన్నదమ్ములు మోక్షజ్ఞ, భీష్మ స్వర్ణాలు సాధించారు. ఇటీవల తమిళనాడులోని పొలాచ్చిలో ఈ పోటీలు జరిగాయి. వీరిద్దరూ కోచ్ సత్యనారాయణ శిక్షణలో ఆర్టిస్టిక్ ఫ్రీ స్టయిల్, క్వార్టెట్‌ల్లో సత్తా చాటి విజయాలందుకున్నారు. 9–11 ఏళ్ల కేటగిరీ ఫ్రీస్టయిల్, సోలో, క్వార్టెట్‌ల్లో మోక్షజ్ఞ బంగారు పతకాలు సాధించాడు. ఫిగర్, పెయిర్ స్కేటింగ్‌ల్లో రజత పతకాలు సొంతం చేసుకున్నాడు. భీష్మ 7–9 ఏళ్ల కేటగిరీ ఫ్రీస్టయిల్, క్వార్టెట్‌ల్లో స్వర్ణాలు సాధించగా పెయిర్ స్కేటింగ్‌లో కాంస్య పతకాన్ని అందుకున్నాడు. గత ఐదేళ్లలో మోక్షజ్ఞ మొత్తంగా 70 పతకాలు, భీష్మ రెండేళ్లలో 23 పతకాలు సాధించినట్లు వారి తల్లిదండ్రులు తెలిపారు.





రుషికొండ వద్ద ఎగిసిపడుతున్న అలలు

ఏయూక్యాంపస్/కొమ్మాది: అల్పపీడన ప్రభావంతో బుధవారం సముద్రం అల్లకల్లోలంగా మారింది. ఈదురుగాలులు వీయడంతో పాటు కెరటాలు పెద్ద ఎత్తున ఎగసిపడుతున్నాయి. ఫిషింగ్ హార్బర్ వద్ద రాళ్లను కెరటాలు బలంగా తాకుతున్నాయి. ఆర్.కె.బీచ్‌తో పాటు మంగమారిపేట, ఉప్పాడ తీర ప్రాంతాల్లో సముద్రం ముందుకు చొచ్చుకొచ్చింది. సాగర్‌నగర్ సమీపంలో సముద్ర కెరటాల తాకిడికి తీరం భారీ కోతకు గురైంది. అల్పపీడనం కారణంగా మంగళవారం నుంచి నగరంలో పలు చోట్ల వర్షం కురుస్తోంది. కెరటాల ఉధృతితో ఆర్.కె.బీచ్‌లో అంతగా సందర్శకులు కనిపించలేదు. రుషికొండ బీచ్‌లో స్పీడ్ బోటు షికారును నిలిపివేశారు. రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌లకు వచ్చిన పర్యాటకులను మెరైన్ పోలీసులు అప్రమత్తం చేశారు. మత్స్యకారులు ఇళ్లకే పరిమితమయ్యారు.

ముప్పు ముంగిట్లో కొబ్బరి వనం

సాగరతీరంలో నాటిన కొబ్బరి చెట్లు ముప్పు ముంగిట్లో ఉన్నాయి. తీరాన్ని పరిరక్షించే ఉద్దేశంతో ఆర్.కె బీచ్ నుంచి సాగర్‌నగర్ వరకు విరివిగా కొబ్బరి చెట్లు నాటి ఎంతో కష్టంతో వాటిని సంరక్షిస్తున్నారు. ప్రస్తుతం తీరం కోతకు గురవడంతో.. ఈ చెట్లు సైతం వేళ్లతో కొట్టుకుపోతున్నాయి. వైఎంసీఏ వద్ద సముద్రం, చెట్లకు మధ్య రాళ్లతో నిర్మించిన రక్షణ వ్యవస్థ బుధవారం జారిపోయింది. దీని కారణంగా చివర వరుసలో ఉన్న చెట్లు కూలిపోయే పరిస్థితి నెలకొంది.



అందని జీతాలు..అర్ధాకలి బతుకులు

ఇబ్బందులు పడుతున్న పారిశుధ్య కార్మికులు



జీతాలు చెల్లించాలని ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

దాబాగార్డెన్స్: నగర ప్రజలు నిద్రలేచే సమయానికి పారిశుధ్య కార్మికులు విశాఖను అందంగా తీర్చిదిద్దుతారు. ఎక్కడా చెత్త లేకుండా చూస్తారు. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి, అర్ధరాత్రి అనే తేడా లేకుండా అన్ని వేళల్లోనూ విధులు నిర్వర్తిస్తారు. అలాంటిది వారికి నెల నెలా జీతాలు ఇవ్వాలంటే కూటమి ప్రభుత్వానికి కష్టంగా మారింది. ప్రతి నెలా 5వ తేదీలోపు వీరికి జీతాలు చెల్లించాలి. కానీ ఈ నెల 19వ తేదీ వచ్చినా ఇంకా జీతాలు చెల్లించలేదు. దీంతో కుటుంబ పోషణ ఎలా అని కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ప్రతి రోజూ వార్డు కార్యాలయాల వద్ద నిరసన వ్యక్తం చేస్తూ.. అర్ధాకలితో విధులు నిర్వర్తిస్తున్నారు. జీతాలు చెల్లించాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నా.. ఫలితం లేకపోవడంతో విధులు బహిష్కరిస్తామని హెచ్చరిస్తున్నారు.

జీవీఎంసీ పరిధిలోని అన్ని విభాగాల్లో సుమారు 8 వేల మంది(ఆప్కోస్‌లో ఉన్నవారు, అంతకు ముందు ఉన్నవారు) అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వీరికి జీతాల సమస్య తలెత్తలేదు. ప్రతి నెలా 5వ తేదీలోపే వీరి ఖాతాల్లో జీతాలు జమయ్యేవి. కార్మికులు సంతోషంగా ఉండేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మికులకు కష్టాలు మొదలయ్యాయి. సమయానికి జీతాలు అందక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 5వ తేదీలోగా రావాల్సిన జీతాలు ఇప్పటి వరకు చెల్లించలేదు. ఫలితంగా కార్మికులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. '19వ తేదీ వచ్చినా నేటికీ అధికారులు జీతం ఊసెత్తకపోవడంతో కార్మికులు అప్పులు చేసి గడుపుతున్నారు. ప్రతి నెలా ఇదే పరిస్థితి ఉంది. ఒక పూట పనికి రాకపోతే అనేక ప్రశ్నలతో వేధించే అధికారులు.. తమ జీతం విషయంలో ఎందుకు నోరు మెదపడం లేదో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా జీతాలు చెల్లించాలి. లేకుంటే విధులు బహిష్కరిస్తాం.' అని జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(సిటు) ప్రధాన కార్యదర్శి యు.రాజు హెచ్చరించారు.

26 నుంచి మున్సిపల్ కార్మికుల రిలే దీక్షలు

మున్సిపల్ కార్మికులకు నవంబర్ జీతాలు వెంటనే చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. గత సమ్మె కాలంలో ఒప్పందం మేరకు పెండింగ్ జీవోలు వెంటనే జారీ చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులు, ఎస్ఎంఆర్, బదిలీ, కోవిడ్ కార్మికులకు జీవో 36 ప్రకారం రూ.21 వేల జీతం చెల్లింపు, క్లాప్ డ్రైవర్లకు బకాయి జీతాల విడుదల తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ మేరకు బుధవారం విజయవాడలోని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ సీ అండ్ డీఎంఏ హరినారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. 2023 డిసెంబర్ 26 నుంచి 2024 జనవరి 11 వరకు జరిగిన సమ్మె సందర్భంగా ప్రభుత్వం అంగీకరించి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు ఇంత వరకు అమలు చేయలేదన్నారు. ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచినప్పటికీ.. మున్సిపల్ రంగంలో ఆ మేరకు జీవో జారీ చేయలేదని పేర్కొన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా జోక్యం చేసుకుని న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. లేకపోతే ఈ నెల 26 నుంచి మున్సిపల్ కార్యాలయాల వద్ద రిలే దీక్షలు, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి 2025 జనవరి 3న అన్ని మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. సీ అండ్ డీఎంఏని కలిసిన వారిలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, డిప్యూటీ కార్యదర్శి ఎంపీ ప్రసాద్ ఉన్నారు.

'డెయిరీ కార్మికులకు న్యాయం చేస్తాం'



మాట్లాడుతున్న విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్

అక్కిరెడ్డిపాలెం: ప్రభుత్వ జీవోలు, చట్టాల ప్రకారం కార్మికులకు న్యాయం చేస్తామని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ హామీ ఇచ్చారు. వామపక్ష నేతలతో కలిసి విశాఖ డెయిరీ కార్మికులు బుధవారం చైర్మన్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. తమకు న్యాయం చేయాలని నినదించారు. దీంతో చైర్మన్ ఆనంద్‌కుమార్ కార్మికుల వద్దకు వచ్చిన యూనియన్ నాయకులు కార్మికుల డిమాండ్‌లను వివరిస్తుండగా.. ఆనంద్ కుమార్ వాటికి వివరణ ఇచ్చారు. ప్రభుత్వ విధానాలు, జీవోల ఆధారంగా కార్మికుల హక్కులను అమలు చేస్తామని సమాధానమిచ్చారు. కార్మికులను పర్మినెంట్ చేసే అంశంపై కమిటీ(కార్మికులు, డైరెక్టర్లు) వేసి.. చర్చల ద్వారా నిర్ణయం తీసుకుంటామన్నారు. జీతాలు పెంచే అంశం కూడా సులభంగా తీసుకునే నిర్ణయం కాదన్నారు. దీనికి సీనియారిటీ రికార్డుల పరిశీలన చేస్తామన్నారు. ప్రసూతి సెలవులను విధివిధానాల ప్రకారం అమలు చేస్తామన్నారు. కాగా.. యాజమాన్యం, యూనియన్ ప్రతినిధులు త్వరలో సమావేశమై.. కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం చర్చలు జరపడానికి అంగీకరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గాజువాక ఏసీపీ టి.త్రినాథ్, సీఐ పార్థసారథి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు.

కొరియర్ ద్వారా గంజాయి రవాణా

- తప్పుడు చిరునామాతో బట్టబయలు
- పారిశ్రామిక ప్రాంతంలో అక్రమ నిల్వలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో అద్దె ఇంట్లో భారీగా గంజాయి నిల్వలను పోలీసులు గుర్తించారు. ఆ ఇంటి నుంచే ఆటో ద్వారా వివిధ ప్రాంతాలకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. వివరాలివీ.. ఇటీవల టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి నుంచి న్యూఢిల్లీకి ఒక కొరియర్ సంస్థ ద్వారా గంజాయి పార్శిల్ పంపారు. అయితే కొరియర్ చేరాల్సిన చిరునామా తప్పుగా ఉండటంతో.. అక్కడి పార్శిల్ బాయ్‌కు అనుమానం వచ్చింది. ఈ విషయాన్ని ఇక్కడి నుంచి పంపిన సంస్థకు తెలియజేసి పార్శిల్‌ను తిరిగి విశాఖ పంపాడు. దీంతో వారు ఈ విషయాన్ని టూ టౌన్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు పార్శిల్ తనిఖీ చేసి అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. కొరియర్ సంస్థకు పార్శిల్ పంపిన వ్యక్తులు ఇచ్చిన చిరునామా(60వ వార్డు పరిధిలోని ఎంఐజీ–1, 22–65–5–22 క్వార్టర్స్)ను పరిశీలించగా.. అది ప్రమోద్‌కు చెందిన పాత ఇంటి చిరునామాగా తేలింది. ప్రమోద్ బిహార్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులకు నెలకు రూ.9వేలకు ఆ ఇంటిని అద్దెకు ఇచ్చినట్లు పోలీసులకు తెలిపాడు. సదరు వ్యక్తులు ఒక ఆటోను అద్దెకు తీసుకుని.. ఆ ఇంట్లో గంజాయి బస్తాలను నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు ఆటో ద్వారా గంజాయి సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మంగళవారం రాత్రి టూ టౌన్ పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి.. 100 కిలోల గంజాయిని స్వాధీనం చేస్తున్నారు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. మల్కాపురం పోలీసుల సహాయంతో ఆ ఇంటిని సీజ్ చేశారు. ఈ కేసులో బుధవారం ఒక నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

చోరీ చేసిన వ్యక్తికి రెండేళ్ల జైలు

విశాఖ లీగల్: చోరీకి పాల్పడిన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ నగరంలోని ప్రధాన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎం.ప్రదీప్ కుమార్ బుధవారం తీర్పునిచ్చారు. జైలు శిక్షతోపాటు రూ.12,000 జరిమానా చెల్లించాలని, లేనిపక్షంలో అదనంగా రెండు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో వివరించారు. సీనియర్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మైలపల్లి ఆదినారాయణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు ఆకుల శివాజీ అక్కయ్యపాలెం నివాసి. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంటి తాళాలను తొలగించి బంగారు నగలు, నగదు వంటివి చోరీ చేసేవాడు. అదే విధంగా 2023 జూన్ 6వ తేదీన వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని థామ్సన్ వీధిలోని బంటు వెంకటలక్ష్మి ఇంట్లో రెండు తులాల పుస్తెలతాడు, రూ.60 వేల నగదు దొంగిలించాడు. వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీస్ అధికారి పి.శ్రీనివాసరావు నిందితునిపై భారతీయ శిక్షాస్మృతి 454, 380 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పునిచ్చారు.

ఉత్సాహంగా బధిరుల క్రికెట్

విశాఖ స్పోర్ట్స్: బధిరుల టీ–20 క్రికెట్ పోటీలు వైఎస్ఆర్ స్టేడియం బి గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించారు. ఈ టోర్నీలో విశాఖతో పాటు అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, మన్యం జిల్లాలకు చెందిన బధిరులు పాల్గొన్నారు. డెఫ్ ఫెడరేషన్ అభ్యర్థన మేరకు కలెక్టర్ హరేందిరప్రసాద్ ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ పోటీల్లో పాల్గొనేవారికి వసతి, భోజన సదుపాయాల్ని సమకూర్చింది. ఈ పోటీల ప్రారంభ కార్యక్రమంలో నిర్వాహక కమిటీ ప్రతినిధులు జూన్ గాలియట్, సూర్యనారాయణ, అప్పలనాయుడు, ప్రేమ్‌చంద్, హసీం, నాగార్జున, సంతోష్, అబ్దుల్, డీఎస్ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

జనవరిలో స్టీల్‌ప్లాంట్ సమస్యలకు పరిష్కారం

కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి హామీ



కేంద్ర మంత్రికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఉక్కునగరం: జనవరిలోగా స్టీల్‌ప్లాంట్ సమస్యలకు పూర్తి పరిష్కారం లభిస్తుందని కేంద్ర ఉక్కు మంత్రి హెచ్‌డీ కుమారస్వామి హామీ ఇచ్చినట్లు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. సీపీఎం రాజ్యసభ సభ్యుడు డాక్టర్ వి.శివదాసన్ నేతృత్వంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి స్టీల్‌ప్లాంట్ సమస్యలపై వినతిపత్రం అందించారు. స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తు కోసం క్యాపిటల్ రీస్ట్రక్చరింగ్ చేయడంతో పాటు అవసరమైన వర్కింగ్ క్యాపిటల్ అందించాలని అభ్యర్థించారు. పూర్తి భరోసా కోసం సెయిల్, ఎన్ఎండీసీలో విలీనం చేయాలని కోరారు. వీటిని పరిష్కరిస్తే అతి త్వరలోనే టర్న్ అరౌండ్ సాధిస్తామని లేఖలో పేర్కొన్నారు. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ జనవరిలో కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ఇస్తుందని, తద్వారా ఉద్యోగుల పెండింగ్ జీతాలు క్లియర్ చేస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం వారు కేంద్ర ఉక్కు సంయుక్త కార్యదర్శి డాక్టర్ సంజయ్ రాయ్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు.

విజయ్ హజారే ట్రోఫీకి విశాఖ సిద్ధం

21 నుంచి లీగ్ మ్యాచ్‌లు



విశాఖ స్పోర్ట్స్: దేశవాళీ లిస్ట్ ఏ క్రికెట్ టోర్నమెంట్ విజయ్ హజారే ట్రోఫీకి వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియం సిద్ధమైంది. టోర్నీలో భాగంగా మొత్తం 38 జట్లు లీగ్ దశలో పోటీపడనుండగా, గ్రూప్–డీ మ్యాచ్‌లు ఈ నెల 21 నుంచి విశాఖ వేదికగా ప్రారంభం కానున్నాయి. ముంబయ్, నవీ ముంబయ్ వేదికల్లో ఆంధ్ర జట్టు గ్రూప్ బీలో ఆడనుంది. లీగ్ దశలో ఏడు వన్డే మ్యాచ్‌లు వైఎస్సార్ స్టేడియంలో జరగనున్నాయి. గ్రూప్ దశ పోటీలు రౌండ్–రాబిన్ పద్ధతిలో జనవరి 5తో ముగియనుండగా.. ప్లేఆఫ్ మ్యాచ్‌లు 9 నుంచి ప్రారంభమవుతాయి. జనవరి 18న ఫైనల్ జరగనుంది.

విజయ్ హజారే ట్రోఫీలో భాగంగా విశాఖ వేదికగా మొదటి మ్యాచ్ ఈ నెల 21న ఉదయం 9 గంటలకు ఛత్తీస్‌గఢ్, మిజోరం జట్ల మధ్య జరుగుతుంది. ఛత్తీస్‌గఢ్ జట్టుకు అమన్‌దీప్, మిజోరం జట్టుకు జోథన్ సంగా కెప్టెన్‌లుగా వ్యవహరిస్తారు. రెండో మ్యాచ్ ఈ నెల 23న రింకూసింగ్ కెప్టెన్సీలో ఉత్తరప్రదేశ్ జట్టు మిజోరంతో తలపడనుంది. 26న మూడో మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్‌తో సాయికిశోర్ నాయకత్వంలో తమిళనాడు జట్టు ఆడనుంది. 28న నాలుగో మ్యాచ్ కరణ్ నాయర్ కెప్టెన్సీలో విదర్భ జట్టు, మనన్‌వోరా కెప్టెన్సీలో చండీగఢ్ జట్ల మధ్య జరగనుంది. ఈ నెల 31న తమిళనాడుతో విదర్భ, జనవరి 3న ఛత్తీస్‌గఢ్‌తో పరాస్‌దోగ్రా కెప్టెన్సీలో జమ్ముకశ్మీర్ జట్టు ఆడనుంది. లీగ్ చివరి మ్యాచ్ జనవరి 5న జమ్ముకశ్మీర్‌తో చండీగఢ్ తలపడనుంది.

ఈ సారి భరత్ కెప్టెన్సీలో..

ఆంధ్ర జట్టు ఈసారి కె.ఎస్.భరత్ కెప్టెన్సీలో ఆడనుంది. భరత్ వికెట్ల వెనుక నిలబడటంతో పాటు ఓపెనర్‌గా రానున్నాడు. జట్టులోని మరో ముఖ్య ఆటగాడు రికీబుయ్ టాపార్డర్ బ్యాటర్‌గా బరిలోకి దిగనున్నాడు. అశ్విన్ హెబ్బర్ ఓపెనర్‌గా, వైస్ కెప్టెన్ షేక్ రషీద్, పృథ్వీలు టాపార్డర్‌లోనే బ్యాటింగ్‌కు దిగనున్నారు. మిడిలార్డర్‌లో తేజ రానున్నాడు. మీడియం పేస్‌తో శశికాంత్, అఖిల్, మహీప్, సత్యనారాయణ, తపస్వీలు చెలరేగనుండగా, స్పిన్‌తో అభినవ్, అంజనేయులు, సందీప్, కుమార్ బంతిని గింగిరాలు తిప్పనున్నారు. ఆంధ్ర తన తొలి మ్యాచ్‌ను రైల్వేస్‌తో ఆడనుండగా, రాజస్థాన్, సిక్కిం, సర్వీసెస్, మేఘాలయ, మహారాష్ట్రలతో వరుసగా మ్యాచ్‌లాడనుంది. లీగ్ చివరి మ్యాచ్‌లో హిమాచల్ ప్రదేశ్‌తో తలపడుతుంది.

పిల్లలకు ప్రత్యేక ఓపీ, వార్డు ఏర్పాటు



మాట్లాడుతున్న గొండు సీతారామ్

సీతంపేట: పిల్లల్లో వచ్చే నేత్ర సమస్యలు, నియంత్రణ చర్యలపై రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సమీక్ష చేపట్టింది. ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ ఆస్పత్రిలో పిల్లలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు నెల రోజుల్లో పిల్లల కోసం ప్రత్యేక ఓపీ విభాగం, ఐదు బెడ్లతో పిల్లల వార్డు ఏర్పాటు చేస్తామన్నారు. 2024లో ఇప్పటి వరకు 3,613 మంది పిల్లలకు వైద్యం, 70 మందికి సదరం సర్టిఫికెట్లు ఇచ్చినట్లు వెల్లడించారు. 133 మందికి రెటినోపతి వైద్యం, జిల్లాల్లోని 541 పాఠశాలల్లో 54,124 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

మహారాణిపేట: అల్ప పీడనం ప్రభావంతో జిల్లాలో మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు వీలైనంత వరకు వరి కోతలు వాయిదా వేసుకోవాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. నూర్పు అయిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలని, అవసరమైన చోట రైతులకు టార్పాలిన్లు అందజేయడానికి వ్యవసాయ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ఇంతవరకు పది ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 376 మంది రైతుల నుంచి 2,028.34 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపారు.

కెనడాలో విశాఖ వాసి మృతి



పిల్లి ఫణికుమార్(ఫైల్)

పెదగంట్యాడ: మండలంలోని దయాల్‌నగర్ వాసి కెనడాలో మృతి చెందాడు. దయాల్‌నగర్‌కు చెందిన పిల్లి నాగప్రసాద్, గీతాబాయి దంపతుల పెద్ద కుమారుడు పిల్లి ఫణికుమార్(36) గీతంలో ఎంబీఏ పూర్తి చేశాడు. కెనడాలోని కాల్‌గరీలో ఉన్న సదరన్ ఆల్బెర్టా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఎమ్మెస్సీ చేసేందుకు ఆగస్టు 21న వెళ్లాడు. ఈ నెల 14న ఉదయం ఫణికుమార్ సోదరుడు పవన్‌కుమార్‌కు కెనడాలో ఫణికుమార్‌తో కలసి ఉంటున్న వ్యక్తి ఫోన్ చేశాడు. ఫణికుమార్ రాత్రి నిద్రిస్తున్న సమయంలో ఎగశ్వాసతో గురక పెట్టాడని, దీంతో ఎమర్జెన్సీకి కాల్ చేయగా, వైద్యులు వచ్చి మృతి చెందినట్లు నిర్ధారించి, మృతదేహాన్ని తీసుకెళ్లారని చెప్పాడు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది కెనడాలోని అధికారులకు ఫోన్ చేశారు. మృతదేహానికి పరీక్షలు నిర్వహించి తర్వాత ఇండియా పంపిస్తామని సమాధానమిచ్చారు. తమ బిడ్డ మరణించి ఐదు రోజులు గడుస్తున్నా ఇంతవరకూ ఎలాంటి సమాచారం లేదని, వెంటనే మృతదేహాన్ని తెప్పించే ఏర్పాట్లు చేయాల్సిందిగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కోరారు. స్పందించిన ఆయన ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి మృతదేహాన్ని ఇక్కడకు తీసుకువచ్చే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు.

ఏయూ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ ఫుట్‌బాల్ పురుషుల జట్టును బుధవారం వర్సిటీ అధికారులు ఎంపిక చేశారు. ఇంటర్ యూనివర్సిటీ సౌత్ జోన్ పోటీలు ఈ నెల 21 నుంచి 30 వరకు కాలికట్ యూనివర్సిటీలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో జట్టును ఎంపిక చేసినట్లు ఏయూ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయ్ మోహన్ తెలిపారు. జట్టుకు కోచ్‌గా డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల పీడీ డాక్టర్ లక్ష్మణరెడ్డి వ్యవహరిస్తారన్నారు. వ్యాయామ విద్యా విభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి తదితరులు పాల్గొన్నారు.

తెలుసుకోవడం ప్రజల హక్కు



మాట్లాడుతున్న న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి వెంకటేశ్వరరావు

విశాఖ లీగల్: మైనారిటీ వర్గాల సాధికారత, రక్షణకు చట్టాలు, హక్కుల గురించి అవగాహన పెంపొందించుకోవాలని సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. మైనారిటీల హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్‌లో సమావేశం జరిగింది. జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మైనారిటీ వర్గాలకు చెందిన హక్కులు, చట్టాల గురించి వివరించారు. జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమాధికారి జ్యోతి మాధవి, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ అహ్మద్, సీనియర్ లోక్‌అదాలత్ జాతీయ శిక్షకుడు రఘుపాత్రుని శ్రీనివాసరావు, న్యాయవాదులు ఎం.ఎ.అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.